సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 13 । జూన్ । 2025



భక్తుల అసంతృప్తికి బాధ్యులెవరు?

సత్యదేవుని ఆలయానికి వస్తున్న భక్తులను అన్ని విభాగాల్లోనూ అసంతృప్తి వెంటాడుతోంది. ప్రతి ముగ్గురిలో ఒకరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


నర్సుల బదిలీలలో మాయాజాలం



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నర్సింగ్ అసోసియేషన్‌లో వివాదం చోటు చేసుకుంది. సంఘం నాయకుల అసంబద్ధ చర్యల వల్ల అసంతృప్తి రాజుకుంది.

8లో

డెల్టాకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 250, పశ్చిమ డెల్టాకు 3 వేలు కలిపి, మొత్తం 5,050 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 15,907 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.05 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

వేడుకల సాక్షిగా విభేదాలు

కూటమి సర్కారు వార్షిక సంబరాలకు జనసేన నేతల డుమ్మా

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం టీడీపీ నిర్వహించిన వేడుకల్లో ఆయా పార్టీల వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో నియోజకవర్గ టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి ఈ వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు డుమ్మా కొట్టారు. దీంతో, కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు ముదురుపాకాన పడ్డాయనే విమర్శలు వినిపించాయి. నియోజకవర్గంలో ఆది నుంచీ టీడీపీ, జనసేన నాయకుల మధ్య దూరం స్పష్టంగా కనిపిస్తోంది. వర్గ పోరుతో పాటు ఇటీవల నామినేటెడ్ పదవుల పంపకంలో తమకు తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదని జనసేన నాయకులు ఆగ్రహంతో ఉన్నారు. కూటమి సర్కారు వార్షిక వేడుకలకు టీడీపీ శ్రేణుల నుంచి ఆహ్వానం అందలేదా.. లేక అసంతృప్తితోనే జనసేన నాయకులు రాలేదా అనే విషయం చర్చనీయాంశంగా మారింది.

టెన్త్ సప్లిమెంటరీలో 96.66 శాతం ఉత్తీర్ణత

రాయవరం: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో కూడా జిల్లా మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని కనబర్చింది. 96.66 శాతం ఫలితాలతో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది పదో తరగతి రెగ్యులర్ ఫలితాలు ఏప్రిల్ 23న విడుదల కాగా, 93.18 శాతం ఉత్తీర్ణతా శాతంతో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. మొత్తం 18,871 మంది పరీక్షలకు హాజరు కాగా, 17,253 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇదిలా ఉండగా సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 1,619 మంది హాజరు కాగా, 1,565 మంది ఉత్తీర్ణులయ్యారు. 961 మంది బాలురకు 938 మంది (95.62 శాతం), 638 మంది బాలికలకు 627 మంది (98.28 శాతం) ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ సప్లిమెంటరీలో కూడా జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలవడం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యల కారణంగా అధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

ఓపెన్ టెన్త్‌లో 79.27 శాతం..

ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షలకు 246 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 195 మంది ఉత్తీర్ణులయ్యారు. ఓపెన్ టెన్త్‌లో 79.27 శాతం ఉత్తీర్ణత సాధించారు. 161 మంది బాలురు హాజరు కాగా 122 మంది (75.78 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 85 మంది బాలికలకు 73 మంది (85.88 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఓపెన్ ఇంటర్‌లో జిల్లావ్యాప్తంగా 79.82 శాతం ఉత్తీర్ణత సాధించారు. 674 మంది విద్యార్థులకు గాను 538 మంది పాసయ్యారు. వీరిలో 455 మంది బాలురకు 364 మంది (80 శాతం), 219 బాలికలకు 174 మంది (79.45శాతం) ఉత్తీర్ణత సాధించారు.

జిల్లా దేవదాయ అధికారి బాధ్యతల స్వీకరణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా దేవదాయ శాఖ అధికారిగా కనపర్తి నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా దేవదాయ శాఖాధికారిగా పని చేస్తున్న ఆయన బదిలీపై కాకినాడ జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ సోమరాజు, పలు దేవాలయాలు ఈఓలు అభినందించారు.

వర్షాల హెచ్చరికలతో ఈపీడీసీఎల్ అప్రమత్తం

విశాఖ సిటీ: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ఈపీడీసీఎల్ అప్రమత్తమైంది. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వినియోగదారులకు 24 గంటలు, 24/7 సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చూసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఈలు, ఈఈలను సీఎండీ ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప సిబ్బందికి ఎటువంటి సెలవులూ మంజూరు చేయవద్దని సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నంబర్లకు తెలియజేసి, సత్వర పరిష్కారం పొందవచ్చని సూచించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కంట్రోల్ రూము నంబర్లు

రాజమహేంద్రవరం:	73822 99960
కాకినాడ:	94931 78718
కోనసీమ:	94409 04477
కార్పొరేట్ ఆఫీస్:	1912

● ప్రచారార్భాటానబడి

విద్యార్థులకు కిట్‌కటట

- ప్రారంభమైన పాఠశాలలు
- పూర్తి స్థాయిలో చేరని విద్యార్థి మిత్ర కిట్లు
- నేటికీ జిల్లాకు చేరని యూనిఫాం, మాస్, సాక్సులు



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

సాక్షి, అమలాపురం: బడిగంట మోగింది. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు గురువారం తెరచుకున్నాయి. ఈ తరుణంలో తొలి రోజే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు.. ఇలా అన్నీ కలిపిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్లు అందజేశారంటూ విద్యా శాఖా మంత్రి లోకేష్‌ను భజన బృందం సామాజిక మాధ్యమాల్లో ఆహా ఓహో అంటూ పొగడ్తలతో ముంచెత్తుతోంది. అయితే, వందిమాగధుల ప్రచారంలో వాస్తవం లేదని జిల్లాలో కిట్ల పంపిణీని పరిశీలిస్తే అర్థమవుతోంది. లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్టు ప్రచారం చేయడంలో దిట్ట అయిన చినబాబు అనుచరగణం విద్యార్థులకు పూర్తి స్థాయిలో కిట్లు పంపిణీ చేయకుండానే చేసినట్టు ప్రచారార్భాటం చేస్తోంది. కానీ, అనేక ప్రభుత్వ బడుల్లో అనేక మంది విద్యార్థులు బూట్లు రాలేదని, యూనిఫాం ఇవ్వలేదనే చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన నాడు – నేడు పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయగా.. తల్లికి వందనం సొమ్మును ఇప్పటికే ఒక ఏడాది ఎగ్గొట్టింది. ఇప్పుడు దానిలో కూడా కోత పెడుతోంది. ఇక విద్యార్థులకు అందజేయాల్సిన విద్యార్థి మిత్ర కిట్‌లలో ప్రస్తుతానికి యూనిఫాం, బూట్ల పంపిణీకి కోత పెట్టింది. పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి రోజునే విద్యార్థులకు పూర్తి స్థాయిలో కిట్‌లు అందించడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

90,981 మంది విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 90,981 మంది విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరికి సమగ్ర శిక్షా ద్వారా మూడు జతల యూనిఫాం, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, ఒక జత షూ, రెండు జతల సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్, ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులకు అదనంగా డిక్షనరీలు కలిపి ఒక్కో విద్యార్థికి రూ.2,300 విలువ చేసే కిట్‌లను ప్రభుత్వం అందించాల్సి ఉంది. జిల్లాలోని 90,981 మంది విద్యార్థుల కోసం 4,05,312 పాఠ్య పుస్తకాలు, 77,697 వర్క్‌బుక్స్, 7,936 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 6,112 పిక్టోరియల్ డిక్షనరీలు, 60,390 బెల్టులు, 90,981 బ్యాగ్స్‌ను ఆయా మండల కేంద్రాలకు చేర్చారు. కానీ, తొలి రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీలు మాత్రమే ప్రధానోపాధ్యాయులు అందజేశారు. ఇప్పటి వరకూ యూనిఫాం, షూస్, సాక్సులు జిల్లాకు చేరుకోలేదు. వీటితో పాటు స్కూల్ బ్యాగ్స్ కూడా కలిపి అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో వీటన్నింటి పంపిణీని నిలిపివేశారు.

తల్లికి వందనం వాయిదా

ఏడాది కాలంగా ఊరిస్తున్న తల్లికి వందనం జీఓను ప్రభుత్వం ఎట్టకేలకు గురువారం విడుదల చేసింది. ఈ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో జమయ్యేది మాత్రం వచ్చే నెల 5న అని చావు కబురు చల్లగా చెప్పింది. ప్రభుత్వ వ్యవహారం చూస్తుంటే టీజర్ విడుదలైన నెలా రెండు నెలలకు సినిమా విడుదలైనట్టుందని సెటైర్లు వెల్లువెత్తుతున్నాయి. ఇక లబ్ధిదారుల విషయంలో కూడా భారీగా కోత పెడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు ఇస్తామన్న రూ.15 వేలలో రూ.2 వేలకు కోత పెట్టనున్నారు. ఈ మొత్తాన్ని పాఠశాల మెయింటెనెన్స్‌కు ఇవ్వనున్నారు. ఇది తల్లిదండ్రులను అసంతృప్తికి గురి చేస్తోంది.



కూటమి ప్రభుత్వ కొత్త యూనిఫామ్ నమూనా



Satish Chaganti

ఇవాళ నుంచి స్కూల్స్ మొదలు అవుతున్నాయి

నా చిన్నప్పుడు నుంచి చూస్తున్నా, స్కూల్స్ మొదలయిన నెల రోజులు వరకు పిల్లల వరకు textbooks ఇవ్వరు, పిల్లలకి పుస్తకాలు ఇవ్వలేదు అని వార్తా పత్రికలలో గోల గోల అయ్యేవరకు పుస్తకాలు ఇచ్చే వాళ్ళు కాదు.

కానీ ఈ సంవత్సరం లో 100% textbooks మొదటి రోజే పిల్లలకి స్కూల్స్ లో ఇచ్చేస్తున్నారు , యూనిఫామ్ కూడా ఇస్తున్నారు

దీనికి కారణం అయిన లోకేష్ ని అభినందించాల్సిందే

లోకేష్‌కు భజన చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్ట్

మాటలు ఘనం.. చేతల్లో విఫలం



గతంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో విద్యా సంవత్సరం చివరి దశకు చేరినప్పటికీ కూడా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందని దుస్థితి ఉండేది. అప్పట్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు మాత్రమే ఇచ్చేవారు. 2019 ఎన్నికల్లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్యకు పెద్దపీట వేశారు. బడి వైపు వారిని మరింత ఆకర్షించే దిశగా జగనన్న విద్యా కానుక పేరిట వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభించిన రోజునే కిట్‌లు అందజేసేవారు. గతంలో ఇచ్చిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లకు అదనంగా నోట్ బుక్స్, బెల్టు, బ్యాగ్, ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులకు డిక్షనరీలు జత చేశారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అంతకు ముందు మాదిరిగా పాఠశాలలు తెరచిన రోజునే విద్యా కానుక కిట్‌లు అందజేసేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరును సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా మార్చింది. పాఠశాలలు పునఃప్రారంభించిన రోజునే ప్రతి విద్యార్థి చేతిలో ఈ కిట్‌లు పెడతామని గొప్పగా చెప్పింది. తీరా చూస్తే ఆ మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. విద్యార్థి మిత్ర కిట్‌లు తీసుకుందామని ఆశతో వచ్చిన విద్యార్థులకు నిరాశే ఎదురైంది. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్, లిఫ్కో డిక్షనరీలు మాత్రమే అందజేశారు. బ్యాగ్స్ ఇవ్వకపోవడంతో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు తీసుకుని వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీగా వాణి



సమావేశంలో పాల్గొన్న వాణి, ఉత్తరాధికారి రాఖీ ప్రేమ్, సభ్యులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ కామాక్షీ పీఠ మహాసంస్థానం, శ్రీ కామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ ట్రస్టీ, పీఠాధిపతి కామేశ మహర్షి శివైక్యం చెందడంతో కొత్త ట్రస్టీ ఎంపిక పీఠంలో గురువారం జరిగింది. ఇప్పటి వరకూ మేనేజింగ్ ట్రస్టీ, సభ్యునిగా కామేశ మహర్షే విధులు నిర్వర్తించే వారు. ఆయన స్థానంలో పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరం అమ్మ, కామేశ మహర్షికి వరుసకు సోదరి అయిన వక్కలంక వాణి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా, సభ్యునిగా పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ ఎన్నికయ్యారు. గతంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులుగా పీఠం మేనేజర్ మల్లి దుర్గారావు, న్యాయవాది వీరా నాగేశ్వర రావు, మట్టపర్తి నాగేశ్వరరావు ఉండేవారు. ఇప్పుడు కూడా వారు మరోసారి ట్రస్ట్ సభ్యులుగా ఎన్నికయ్యారు. మొత్తం ఐదుగురితో కూడిన చారిటబుల్ ట్రస్ట్ తొలి సమావేశాన్ని నిర్వహించారు. పీఠాధిపతి శివైక్యం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన లేని లోటు పీఠానికి ఎన్నటికీ తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. వాణి, రాఖీ ప్రేమ్ పేర్లను అప్పటికే ఉన్న ముగ్గురు ట్రస్ట్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పీఠాధిపతి కామేశ మహర్షి దివ్యాశీస్సులతో పీఠం కార్యకలాపాలు, చారిటబుల్ ట్రస్ట్ సేవలు యథావిధిగా కొనసాగించేలా నూతన మేనేజింగ్ ట్రస్ట్ తీర్మానించింది. ప్రేమ మందిరంలో పెరిగే అనాథ బాల బాలికల సంరక్షణ బాధ్యత ఎప్పటిలాగే కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ట్రస్ట్ న్యాయ సలహాదారు, సభ్యుడు వీరా నాగేశ్వరరావు మాట్లాడుతూ పీఠాన్ని, ట్రస్ట్‌ను ఆధ్యాత్మికంగా, సేవాపరంగా నిర్వహించేందుకు ఎప్పటిలానే భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

గోదారి.. కళాఝురి

- ప్రారంభమైన అంతర్జాతీయ కళా సమ్మేళనం
- అలరించిన కళాకారుల నృత్య ప్రదర్శనలు

కొమ్మి జానపద నృత్యం చేస్తున్న కళాకారులు



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కళలకు కాణాచి అయిన ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో.. గోదావరి తీరాన కళాఝురి రసరమ్యంగా ప్రవహించింది. శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం అధ్వర్యాన స్థానిక ఆనం కళా కేంద్రంలో 43వ కళా సమ్మేళనం –2025 గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. భారతీయ కళా వైభవాన్ని చాటేలా పలువురు చిన్నారులు తొలి రోజు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. అంతర్జాతీయ సంగీత, నృత్యోత్సవాల్లో భాగంగా తొమ్మిది మంది సంగీత కళాకారులు వీణానాదంతో అన్నమయ్య కీర్తనలను వీనుల విందుగా వినిపించారు. అలాగే, తమిళనాడుకు చెందిన జానపద కొమ్మి నృత్యాలు, దుర్గ సూక్తం భరతనాట్యం అందరినీ ఆనంద గోదారిలో ఓలలాడించాయి. కళా సమ్మేళనంలో పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కళా సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలి

ఈ ఉత్సవాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన రాష్ట్ర కళా సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం వ్యవస్థాపకుడు జీబీ నారాయణ ఇటీవలి కుంభమేళాలో సైతం తన ప్రదర్శనలతో పలువురి మన్ననలు పొందారని గుర్తు చేశారు. నారాయణ కుమార్తె లక్ష్మీ గీతిక చిన్న వయస్సులోనే కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, మోహిని అట్టం వంటి నృత్యాల్లో ప్రతిభ చూపి ఉపరాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్నారని, ఆమె మరిన్ని అద్భుత ప్రదర్శనలతో రాష్ట్రపతి అవార్డు సైతం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రదర్శనలకు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి శనివారం హాజరు కానున్నారని తెలిపారు. నృత్యాలతో అలరించిన చిన్నారులను మంత్రి అభినందించారు.

కూటమిలో తుని తగవు



అక్రమంగా తవ్విన మట్టితో తునిలో క్యూ కట్టిన టిప్పర్లు



తునిలో ట్రాక్టర్లలలో తరలిస్తున్న మట్టి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అక్రమ సంపాదనలో పంపకాలు తెగక కూటమి నేతలు రోడ్డెక్కుతున్నారు. గద్దెనెక్కిన ఏడాది కాలంగా మట్టి, ఇసుక, మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ నీకు సగం, నాకు సగం అంటూ వాటాలు వేసుకుంటూ, వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య వాటాలు, పంపకాలు తెగక వివాదాలతో రోడ్డెక్కుతున్నారు. పిఠాపురంలో బొండు ఇసుక దందా కోసం జనసేన, టీడీపీ నేతల మధ్య రగిలిన దుమారం చల్లారక ముందే.. తాజాగా తునిలో మట్టి అక్రమ తవ్వకాల చిచ్చు రేగింది.

మాజీ మంత్రి, హోం మంత్రి వర్గాల పోరు

టీడీపీలో నంబర్–2గా చెప్పుకొనే మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఆయన కుమార్తె, తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య ఒకవైపు.. హోం మంత్రి వంగలపూడి అనిత వర్గీయులు మరోవైపు మట్టిలో కాసుల కోసం కొట్టుకుంటున్నారు. మంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం తుని సరిహద్దునే ఉంది. అక్కడి వనిత అనుచరులైన టీడీపీ నేతల మట్టి తరలింపును తుని వైపు యనమల అనుచరులతో పాటు జనసేన నేతలు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తమ నియోజకవర్గంలో మట్టి తవ్వుకుంటూంటే అందులో వాటాలెందుకివ్వాలని పాయకరావుపేట టీడీపీ నేతలు.. మట్టి తమ ప్రాంతానికి తరలిస్తున్నందు తమకు పంపకాలు జరగాల్సిందేనని తుని వైపు కూటమి నేతలు సిగపట్లు పడుతున్నారు. ఈ క్రమంలో వివాదం ముదురు పాకాన పడింది. ఈ నేపథ్యంలో పాయకరావుపేట వైపు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలు, ట్రాక్టర్లు, జేసీబీని తుని వైపు వైరి వర్గం పట్టుకుని, తుని రూరల్ పోలీసులకు అప్పగించింది. దీనిపై ఇరువర్గాలూ గురువారం పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

కొల్లగొడుతున్నారిలా..

పాయకరావుపేట మండలంతో పాటు తుని మండలం ఎస్.అన్నవరం శివారు కవలపాడులో కాకినాడ జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్‌కు చెందిన భూములున్నాయి. ఈ భూముల్లో కొంత మంది ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటుకల తయారీకి ప్రధాన ముడి సరుకు చెరువు గర్భాల్లోని మట్టి. కవలపాడులో చాలా ఏళ్లుగా ఇటుకల బట్టీలు నడుస్తున్నా ఎప్పుడూ ఇటువంటి వివాదాలు లేవని అంటున్నారు. ఇటుక బట్టీలకు అవసరమైన చెరువు మట్టిని టిప్పర్‌కు రూ.10 వేలు, ట్రాక్టర్‌కు రూ.1,200కు అమ్మి కూటమి నేతలు జేబులు నింపుకొంటున్నారు. ప్రతి రోజూ 150 నుంచి 200 ట్రిప్పుల మట్టి రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమంగా తరలించుకుపోతున్నారు. రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా మట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అనుమతి లేనప్పటికీ అధికారం చేతిలో ఉందనే బరితెగింపుతో మట్టి తవ్వి తరలించేస్తున్నారు. అదేమని అడిగి నాథుడే లేకుండా పోయాడు. మట్టి అక్రమాల్లో కూటమి పెద్దలున్నారనే ఉద్దేశంతో తమకెందుకనే ధోరణిలో ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

కుదిరిన సంధి!

వాటాల కోసం రోడ్డెక్కిన నేతల మధ్య కూటమి పెద్దలు సంధి కుదిర్చారని అంటున్నారు. పర్సంటేజీలపై ఒప్పందాలు కుదిర్చి, వివాదాన్ని సర్దుబాటు చేశారని చెబుతున్నారు. పోలీసులకు అప్పగించిన వాహనాలను గంటల వ్యవధిలోనే వదిలేయడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. అక్రమాలను బయటపెట్టి, వాహనాలను పట్టించిన కూటమి నేతలే.. వాటాలు కుదిరేసరికి వెనక్కు తగ్గడం చూసి జనం విస్తుపోతున్నారు. పంపకాల చిచ్చు ప్రస్తుతానికి చల్లారినా.. భవిష్యత్తులో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాల్సిందే.

వాటాల కోసం 'పంచాయితీ'

పాయకరావుపేట మండలం నుంచి మట్టిని తుని మండలం కవలపాడులోని ఇటుక బట్టీలకు తరలిస్తూ పాయకరావుపేట కూటమి నాయకులు రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఈ దందాలో తమకు వాటా లేక అన్యాయమైపోతున్నామని తుని మండలం ఎస్.అన్నవరంలోని టీడీపీ జనసేన నేతలు భావించారు. ఈ నేపథ్యంలో పాయకరావుపేట నుంచి జరుగుతున్న మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అక్రమార్జనలో తమకూ వాటా ఇవ్వాలని కొన్ని రోజులుగా తుని టీడీపీ పెద్దల వద్ద పంచాయితీ నడుస్తోంది. పాయకరావుపేటలో బీజేపీకి చెందిన ఒక కీలక నేత, బంగారయ్యపేటకు చెందిన టీడీపీ ద్వితీయ శ్రేణి నేత, తుని మండలం ఎస్.సూరవరం గ్రామ టీడీపీ నేతలు మట్టిలో అక్రమార్జన కోసం కుస్తీ పడుతున్నారు. అయినప్పటికీ పాయకరావుపేట నేతలు దారికి రావడం లేదు. దీంతో, తుని టీడీపీ, జనసేన నేతలు గురువారం తెల్లవారుజామున రంగంలోకి దిగారు. కవలపాడు మట్టి లోడుతో వచ్చిన మూడు లారీలను, మూడు ట్రాక్టర్లను, ఒక జేసీబీని అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో, ఈ వివాదం మరింత రచ్చకెక్కింది. మట్టి తవ్వకాల్లో వాటాల కోసం ఇంత నిస్సిగ్గుగా రోడ్డెక్కుతున్న కూటమి నేతలను చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

క్లుప్తంగా

బాలుడి మోటార్ సైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి

రాజోలు: మోటార్ సైకిల్ ఢీ కొని రాజోలు తెన్నేటినగర్‌కు చెందిన పొన్నపల్లి పురుషోత్తం (72) గురువారం మృతి చెందారు. స్థానిక తెన్నేటినగర్ నుంచి రాజోలు సెంటర్‌లోని కాఫీ హోటల్‌కు వెళ్తున్న పురుషోత్తంను రాజోలు నుంచి శివకోడు వైపు వెళ్తున్న ఒక బాలుడు మోటార్ సైకిల్‌తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడు పురుషోత్తం రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రాజోలు అడిషనల్ ఎస్సై కె.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వివాహిత మహిళను బెదిరించినందుకు కేసు

కోరుకొండ: సీతానగరం మండలం రామచంద్రపురానికి చెందిన గుడబండి పోసమ్మ, ఆమె మేనకోడలును బరగడి నాగేశ్వరరావు వీడియోలు తీసి, బెదిరించినట్టు గురువారం కేసు నమోదైంది. సీతానగరం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మే నెల 31వ తేదీన పోసమ్మ, ఆమె మేనకోడలును బరగడి నాగేశ్వరరావు సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసి, దాన్ని ప్రశ్నించినందుకు బెదిరించినట్టు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామ కుమార్ తెలిపారు.

వైద్య విద్యార్థుల సంతాపం

కాకినాడ క్రైం: అహ్మదాబాద్ బోయింగ్ విమాన ప్రమాద ఘటన వైద్య వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు 240 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ప్రయాణికులతో సహా సమీపంలో ఉన్న వైద్య కళాశాలపై కుప్పకూలింది. ఈ ఘటనలో ప్రయాణికులతో పాటు 20 మందికి పైగా వైద్య విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటనపై ఎరెవ్నా సదస్సుకు కాకినాడకు వచ్చిన వైద్య విద్యార్థులు సంతాపాన్ని తెలిపారు. గురువారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

భక్తుల అసంతృప్తికి బాధ్యులెవరు?

- పనితీరు మార్చుకోని అధికారులా? విమర్శలొచ్చినా పట్టించుకోని ప్రభుత్వమా?
- అన్నవరం దేవస్థానంలో మెరుగుపడని పరిస్థితులు



సరైన షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసిన భక్తులను అన్ని విభాగాల్లోనూ అసంతృప్తి వెంటాడుతోంది. ప్రతి ముగ్గురిలో ఒకరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం చేసిన సర్వేలలో వెల్లడవుతున్న నిజం. రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి నుంచి వాట్సాప్, ఐవీఆర్ఎస్ ద్వారా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలలో భక్తుల అభిప్రాయాలను సేకరిస్తుండగా ఏ నెలలో కూడా అన్నవరం దేవస్థానం టాప్ వన్ స్థానంలో లేకపోవడం విశేషం. తాజాగా ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 25 వ తేదీ వరకు నిర్వహించిన సర్వేలో అన్నవరం దేవస్థానానికి విచ్చేసిన భక్తుల్లో 35 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తేలింది.

ఒకప్పుడు ఎంతో గొప్ప

అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయమంటే ఒకప్పుడు ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. ఉత్తరాన పంపా నది, పచ్చని రత్నగిరి, సత్యగిరి కొండలపై వెలసిన అనంతలక్ష్మీ సత్యవతీ సమేత సత్యదేవుడు, నిత్యకల్యాణం పచ్చతోరణంలా విలసిల్లే ఆలయం, కమ్మని సత్యదేవుని ప్రసాదం, ఎక్కడ చూసినా అద్దంలా దర్శనమిచ్చే ఆలయ ప్రాంగణం, భక్తులకు గౌరవ మర్యాదలతో సిబ్బంది సేవలు ఇలా ఉండేది. నేడు సిబ్బందికి, ఈఓకు మధ్య కుదరని సమన్వయం, క్షేత్రస్థాయిలో పర్యటించని ఈఓ, ఆయన వ్యవహారశైలిపై అధికారుల అసంతృప్తి, వీటిపై మీడియాలో వచ్చిన కథనాలపై అడిషనల్ కమిషనర్ నివేదిక సమర్పించినా దానిపై ఏ విధమైన స్పందన లేని వైనం ఇలా అంతా అందరిదీ తలో దారి అన్నట్టు తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మే లో పెరిగిన భక్తుల అసంతృప్తి

రాష్ట్రంలోని ఏడు ప్రముఖ పుణ్యక్షేత్రాలలో జనవరిలో సేకరించిన అభిప్రాయ సేకరణలో అన్నవరం ఏడో ర్యాంకులో నిలిచింది. ఫిబ్రవరిలో సేకరించిన అభిప్రాయ సేకరణలో రెండో ర్యాంకు వచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలలో సర్వేలలో భక్తుల అసంతృప్తి 30, 31శాతంగా నమోదైంది. మే నెలలో ఇది 35 శాతానికి చేరింది.

ఏప్రిల్ 30– మే 25 మధ్య అభిప్రాయాల సేకరణ

దేవస్థానాలు భక్తులకు అందిస్తున్న సేవలు, ప్రసాదం నాణ్యత, ఇతర ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నావళి ద్వారా వారి అభిప్రాయాలు తెలుసుకుంది. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం , తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం, ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల, ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కనకదుర్గ గుడి, విశాఖ జిల్లా సింహాచలం శ్రీవరాహ నృశింహస్వామి దేవస్థానం, నంద్యాలలోని శ్రీభ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానం, అన్నవరంలోని సత్యనారాయణ స్వామివారి దేవస్థానాల్లో భక్తుల అభిప్రాయాలు సేకరించింది.

దర్శనంపై 32 శాతం అసంతృప్తి

సత్యదేవుని దర్శనం సకాలంలో జరిగిందా అనే దానికి 68 శాతం మంది భక్తులు అవునని సమాధానం చెప్పగా 32 శాతం మంది కాలేదని చెప్పారు. దేవస్థానంలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, వాష్ రూమ్స్, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాలు, చెప్పులు భద్రపరిచే చోటు, తదితర విషయాలపై 61 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. సత్యదేవుని ప్రసాదం రుచి, నాణ్యత విషయాలలో 78 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యంపై 64 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.

బాధ్యత ప్రభుత్వానిదా.. అధికారులదా?

అన్నవరంలో పరిస్థితి దిగజారడానికి బాధ్యత ఎవరిది అనే చర్చ నడుస్తోంది. ఒక నెలలో అసంతృప్తి ఉంటే తరువాత నెల మార్పు వచ్చేలా చేయాలి. కాని అదే అసంతృప్తి కొనసాగుతుంటే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అనే అభిప్రాయం వినిపిస్తోంది.

పరిస్థితి చక్కదిద్దాలని కలెక్టర్ ప్రయత్నించినా....

జనవరిలో ఏడో ర్యాంకు రావడంతో కలెక్టర్ షణ్మోహన్ ఫిబ్రవరిలో దేవస్థానానికి వచ్చి అన్ని విభాగాల పర్యవేక్షించి పలు చర్యలు తీసుకున్నారు. అన్నదానంలో సిట్టింగ్‌తో బాటు బఫే పద్ధతిలో కూడా భోజనాలు పెట్టేలా చర్యలు తీసుకున్నారు. సత్రాలలో గదులు భక్తులకు అద్దెకివ్వాలని, బ్లాక్ చేసి దళారీల ద్వారా అమ్ముకోవద్దని హెచ్చరించారు. ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ పేమెంట్స్ కోసం వైఫై ఏర్పాటు చేసి దర్శనం, సేవా టిక్కెట్ల కొనుగోలు, సత్రాలలో గదులు అద్దెకిచ్చేలా ఏర్పాటు చేశారు. పారిశుధ్యం మెరుగుపర్చాలని ఆదేశించారు. ఆ నెలకే అదంతా అమలైంది.

గత ప్రభుత్వంలో ఇలా..

గతం లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దేవస్థానంలో సుమారు రూ.30 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. 50 వ్రత పురోహిత పోస్టులు భర్తీ చేశారు. వారికి 30 నుంచి 40 శాతం పారితోషికం పెంచారు. భక్తుల సదుపాయాలకు పెద్ద పీట వేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి భక్తుల అసంతృప్తిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భక్తుల అసంతృప్తికి కారణాలివీ...

- వైఫై పనిచేయక భక్తులు డిజిటల్ పేమెంట్స్ కోసం ప్రయాస పడాల్సి వస్తోంది.
- పశ్చిమ రాజగోపురం వద్ద గైడ్లు మళ్లీ చెలరేగిపోతున్నారు. వీరు భక్తులను రూ.వేయి ఇవ్వండి సులభంగా దర్శనం చేయిస్తాం అని చెప్పి దేవస్థానం ఉద్యోగులు, సెక్యూరిటీ వారికి ఆ భక్తులను అప్పగిస్తారు. వారు నేరుగా దేవాలయానికి తీసుకువెళ్లి దర్శనం చేయిస్తారు. గైడ్లు వసూలు చేసిన సొమ్ము సమానంగా పంచుకుంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- దేవస్థానం ఈఓ ఎప్పుడూ ఆలయంలో గంటసేపు ఉన్న దాఖలా లేదు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
- ఆరు నెలలుగా దేవస్థానంలో వివాదాలు లేని నెల లేదంటే ఆశ్చర్యం. ఫిబ్రవరిలో ఉచిత కల్యాణ మండపంలో ఒక సంస్థ కార్యవర్గం ప్రమాణ స్వీకారం వివాదంగా మారింది. మార్చి నెలలో దేవస్థానంలో చినబాబు హల్‌చల్ చేయడం, అదే నెలలో ఏసీ గదులు అద్దెకివ్వడం లేదని ఈఓ చేసిన ప్రకటన వివాదాస్పదం అవడం, ఈఓపై దిగువ స్థాయి అధికారుల అసంతృప్తి, ఈఓపై వచ్చిన విమర్శలపై ఏడీసీ విచారణ, ఏప్రిల్, మే నెలలో శానిటేషన్ సిబ్బంది జీతాల ఆలస్యం, చెత్త ట్రాక్టర్ టెండర్ వివాదం, మేలో కల్యాణోత్సవాలలో వనదుర్గ అమ్మవారికి హోమాలు నిలిపివేయడం, శ్రీపుష్పయాగం రోజు స్వామి, అమ్మవారి అలంకరణ ఆకట్టుకోకపోవడం ఇలా ఎన్నో వివాదాలు దేవస్థానం ప్రతిష్ఠను పలుచన చేశాయి.

నర్సుల బదిలీలలో మాయాజాలం

- అగ్ర నాయకత్వం అడ్డదారులు
- విజిలెన్స్‌కి చేరిన వ్యవహారం

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నర్సింగ్ అసోసియేషన్‌లో వివాదం చోటు చేసుకుంది. సంఘం నాయకుల అసంబద్ధ చర్యల వల్ల అసంతృప్తి రాజుకుంది. ఉత్తుత్తి ఈసీ మెంబర్లను సృష్టించి ఆఫీస్ బేరర్ల హోదాలో బదిలీలో మినహాయింపు పొందాలనే పన్నాగానికి సంఘ అగ్ర నాయకత్వం తెర తీసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసోసియేషన్ నాయకత్వ ఎన్నిక గత ఏడాది నవంబర్‌లో జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ల హోదాలో మొత్తం 9 మంది ఎన్నికయ్యారు. వీరిలో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొనసాగుతున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం అన్ని శాఖలకు బదిలీల ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో సంఘ నాయకత్వానికి బదిలీల నుంచి కొన్ని షరతుల ఆధారంగా మినహాయింపునిచ్చింది. దీంతో సంఘ నాయకత్వాలకు గిరాకీ మొదలైంది. దీంతో నర్సింగ్ అసోసియేషన్ నాయకులు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ద్వారా ఆర్‌డీ డాక్టర్ పద్మశశిధర్‌కి తమ సంఘ నాయకుల జాబితాను పంపి, ఆఫీస్ బేరర్ల హోదాలో ఇందులో ఉన్న ఇద్దరు ఈసీ మెంబర్లకి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. ఇక్కడ విషయం ఏంటంటే వీరు కోరిన ఆ ఇద్దరూ అసలు ఈసీ మెంబర్లే కాదు. కనీసం ఎన్నికల్లో పోటీ కూడా చేయలేదు. కాకినాడ జీజీహెచ్‌లో నర్సులుగా పనిచేస్తున్న గొల్లపల్లి సుశీల రాణి, మందపల్లి నీలమణి పేర్లు ఈ జాబితాలో చేర్చి కలెక్టర్, ఆర్‌డీలను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి స్థానంలో వాస్తవంగా ఎన్నికైంది మచ్చా సుజాత, కె.దేవి. స్టేట్ ఈసీగా కె.దేవిని చూపిస్తూ పెన్‌తో రాసేసి రాష్ట్ర పరిధికి నెట్టేశారు. ఎన్నికల్లో ఎన్నికైన మచ్చా సుజాత పేరు అసలు ఈ జాబితాలో లేదు. ఈ విషయంపై అప్పటి ఎన్నికల అధికారులు కోపరేటివ్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు నందన, శివకామేశ్వరరావులను వివరణ కోరగా ఎన్నికైన జాబితాలో ఈసీ మెంబర్ల హోదాలో సుశీలరాణి, నీలమణి అనే పేర్లు లేనేలేవని నిర్ధారించారు. ఈ వివాదం కాస్తా విజిలెన్స్‌కి చేరడంతో పరిశీలన మొదలైంది.

వార్డు మెంబర్‌పై చేయి చేసుకున్న సర్పంచ్ భర్త

జిల్లా అధికారులకు ఫిర్యాదు

అల్లవరం: గోడి పంచాయతీ 10వ వార్డులోని ప్రజలకు గ్రామీణ రక్షిత మంచినీటి పథకంలో శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయరా? అని ప్రశ్నించిన వార్డు మెంబర్ చెవల శ్రీనివాసరావుని సర్పంచ్ తోట శ్రీదేవి భర్త నరసింహరావు చెంపపై కొట్టాడు. బాధితుడు శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం 10వ వార్డులో నాలుగు రోజులుగా తాగునీరు పంపిణీ కావడం లేదు. గోడిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీనివాసరావు మోటారు సైకిల్‌పై ఉండగా సర్పంచ్ భర్త తోట నరసింహరావు అక్కడికి వచ్చారు. నాలుగు రోజులుగా నీరు రావడం లేదని సర్పంచ్ భర్తను ప్రశ్నించారు. మీకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా అవుతోందని నరసింహరావు చెప్పారు. అయితే ట్యాంకర్ల నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, మా వార్డు ప్రజలకు రక్షిత మంచినీరు ఇవ్వాలని వార్డు మెంబర్ డిమాండ్ చేశారు. దీంతో మోటారు సైకిల్‌పై శ్రీనివాసరావును నరసింహరావు చెంపపై కొట్టాడు. ఈ ఘటనపై కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు. దీనిపై అల్లవరం పోలీసుల్ని వివరణ కోరగా ప్రాథమిక విచారణ చేస్తున్నామని తెలిపారు.

కొవ్వూరులో అర్ధరాత్రి దొండగుంట–2 డీ సిల్టేషన్

- రీచ్ వద్ద డ్రెడ్జింగ్ బోట్ సీజ్
- జిల్లా మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి



డ్రెడ్జింగ్ పడవలను సీజ్ చేసిన జిల్లా మైనింగ్ అధికారులు

తాళ్లపూడి (కొవ్వూరు): గోదావరి నదిపై నిర్మించిన బ్రిడ్జిల వద్ద నుంచి 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉందని జిల్లా మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సాధారణ తనిఖీల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్‌లో గల డీ సిల్టేషన్ ఇసుక రీచ్‌లను పరిశీలించామని చెప్పారు. దొండగుంట–2 డీ సిల్టేషన్ ఇసుక రీచ్‌లో ఒక డ్రెడ్జింగ్ బోట్ నుంచి పొక్లెయిన్ సహాయంతో ఇసుకను దింపుతుండగా అధికారులు గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించినందున ఆ బోట్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆ బోట్‌ను ఇరిగేషన్ శాఖకు అప్పగించామన్నారు. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నిబంధనలకి విరుద్ధంగా అక్రమ ఇసుక కార్యకలాపాల్లో ఇప్పటివరకు పాల్గొన్న 10 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. ఈ తనిఖీలో జిల్లా గనులు,భూగర్భ శాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి కార్మికుడి మృతి



మృతుడు శ్రీనివాసరావు (ఫైల్)

దేవరపల్లి: నల్లజర్ల మండలం పోతవరంలో విద్యుదాఘాతానికి గురై ఆయిల్ పామ్ గెలలను చెట్టు నుంచి దించుతున్న కార్మికుడు తిప్పనబోయిన శ్రీనివాసరావు(35) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నల్లజర్ల మండలంలోని సుభద్రపాలెంకు చెందిన శ్రీనివాసరావు గురువారం ఉదయం పోతవరం శివారులోని ఒక రైతులకు చెందిన పామ్ ఆయిల్ తోటలో గెలలు కోస్తుండగా అతని చేతిలో ఉన్న ఇనుప ఊస ప్రమాదవశాత్తూ పక్కన గల విద్యుత్ తీగలకు తగిలింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుధారాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

పుష్కర్ ఘాట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక పుష్కర్ ఘాట్ వద్దనున్న గోదావరి నదిలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసుగల వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. 5.5 అడుగుల ఎత్తు ఉండగా మృతదేహంపై నీలం రంగు షర్ట్ ఉంది. ఎడమపాదానికి నలుపురంగు కాశీతాడు ఉంది. కుడిచేయి మణికట్టుకు నలుపురంగు పూసల తాడు, కుడిచేయి మణికట్టు వద్ద కాషాయ రంగు తాడు కట్టి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ 9989786529, 9440796532 నంబర్లలో తెలపాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



గుర్తు తెలియని మృతదేహం

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ విశ్వం తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు లాంచీల రేవు వద్ద గోదావరిలో 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఆఫీస్ బేరర్ అయినప్పటి నుంచే లెక్కించాలని వినతి

ఆర్‌డీని కలిసిన ఏపీ ఎన్‌జీవో నేతలు



ఆర్‌డీ డాక్టర్ పద్మాశశిధర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ ఎన్‌జీవో నేతలు

కాకినాడ క్రైం: ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిదేళ్ల మినహాయింపును ఆఫీస్ బేరర్‌గా చేరినప్పటి నుంచి మాత్రమే లెక్కించాలని కోరుతూ జోన్–2 ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు గురువారం సాయంత్రం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మాశశిధర్‌ను రాజమహేంద్రవరంలోని ఆర్‌డీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. స్టేషన్ సీనియారిటీ పరిగణించరనే విషయాన్ని ప్రభుత్వం జీఏడీ సర్కులర్ ద్వారా తెలియజేసిందని పేర్కొన్నారు. సదరు పత్రాలను ఆర్‌డీకి అందజేశారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టడంతో పాటు మినహాయింపులను పరిగణించాలని కోరారు. ఏపీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్ అధ్యక్షతన రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, చోడిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, కృష్ణా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి నేరుసు రామారావు, ఉమ్మడి తూర్పుగోదావరి సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మినిస్టీరియల్ సంఘ అధ్యక్షుడు వీరాజీ, రాజమహేంద్రవరం యూనిట్ సహ అధ్యక్షుడు అనిల్‌తో పాటు వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో జరిగిన లారీ క్లీనర్ కెంగం శ్రీను(43) హత్య కేసులో నిందితులు కెంగం దేవి, జంపా దుర్గారావును గురువారం అరెస్టు చేసినట్టు రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. గురువారం రాత్రి బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. బిక్కవోలు గ్రామంలోని జగనన్న కాలనీలో కెంగం శ్రీనును హతమార్చినట్టు తల్లి సర్వసతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం తెల్లవారుజాము సమయంలో శ్రీను భార్య దేవి, ఆమె ప్రియుడు దుర్గారావు కలిసి ప్లాస్టిక్ స్టూల్‌తో శ్రీను తలపై బలంగా కొట్టారు. అంతటితో ఆగకుండా మృతిని చొక్కాతో ముక్కు, నోరు నొక్కి, ఊపిరాడకుండా చేసి హతమార్చారు. నిందితులను గురువారం బిక్కవోలులో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. హత్య జరిగిన తక్కువ సమయంలోనే నిందితులను పట్టుకున్న సీఐ వీఎల్‌వీకే సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, సిబ్బందిని ఆమె అభినందించారు.

సాంకేతికత సమర్థతే భవిష్యత్ వైద్య రంగం

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్
- ఎరెవ్నా వైద్య విజ్ఞాన సదస్సు ప్రారంభం



డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్, డాక్టర్ విష్ణువర్ధన్

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య విద్యార్థులు నిర్వహిస్తున్న ఎరెవ్నా 4.0 వైద్య విజ్ఞాన సదస్సు గురువారం జీజీహెచ్ ఎదురుగా ఉన్న ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటి వైస్ చాన్సలర్ పి.చంద్రశేఖర్ హాజరై, సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ వైద్య రంగం సాంకేతికత, సమర్థతల సమాహారం అని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్‌ను వీసీ అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన డీఎంఈ అకడమిక్స్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ, నేర్చుకోవడమే వైద్యుడి తపన కావాలని అన్నారు. అటువంటి వారు వైద్య రంగాన్ని శాసిస్తారని చెప్పారు. ప్రయోగాత్మక విద్యాభ్యాసం విషయ అవగాహనకు దోహదపడుతుందని అన్నారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ తమ భవిత కోసం విద్యార్థులే నిర్వహిస్తున్న ఓ అరుదైన సదస్సు ఇదని వ్యాఖ్యానించారు. ఈ సదస్సుకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి మరో విశిష్ట అతిథిగా హాజరయ్యారు. సీపీఆర్ మేన్ ఆఫ్ ఇండియా, ఐఎస్ఏ రిసక్స్యుయేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్.విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశితో పాటు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు. తొలి రోజు 14 వర్క్ షాప్‌లు నిర్వహించినట్లు కోర్ కమిటీ పేర్కొంది. సదస్సు అనంతరం వీసీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ విష్ణువర్ధన్ సత్కారాన్ని అందుకున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,000
గటగట (వెయ్యి)	25,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260